ప్రజాశక్తి
శనివారం 03 జూన్ 2023





బస్సు యాత్రనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు కర్నూలు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు

అడ్డగోలుగా నడిపేస్తున్నారు..!

- ప్రయివేట్ పాఠశాలల్లో నిబంధనలకు నీళ్లు - విద్యా హక్కు చట్టానికి తూట్లు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

నాలుగు ఇరికిరుకు గదులు, భవనాల్లో తరగతులు... ఇదీ చాలా ప్రయివేట్ పాఠశాలల తీరు. నిబంధనలను పక్కనపెట్టి కనీసం విద్యార్థులకు మైదానం లేకుండా పాఠశాలలను అడ్డగోలుగా నడిపేస్తున్నారు. వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పైపైన తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు...

విద్యాధికారులు మాముళ్ల మత్తులో మునిగి ప్రయివేట్ పాఠశాలలకు అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారు. ప్రయివేట్ పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా అనుమతులు ఇస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని కాలరాస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 738 ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో దాదాపు 1.82 లక్షల మంది విద్యార్థులు చదవుతున్నారు. 30 శాతం ప్రయివేట్ పాఠశాలలు కనీస నిబంధనలను పాటించడం లేదు. తరగతి గదుల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వెలుతురు, గాలితో పాటు శుభ్రత ఉండాలి. చాలా పాఠశాలల్లో రేకుల భవనాలే తరగతి గదులుగా కొనసాగుతున్నాయి. ఎలాంటి వెలుతురు ఉండడం లేదు. 40 శాతం ప్రయివేట్ పాఠశాలల్లో పిల్లలకు ఆడుకోవడానికి కూడా మైదానం లేదు. అనుమతుల సమయంలో విద్యాశాఖ చేతివాటం వల్ల విద్యార్థులకు క్రీడా సౌకర్యాలు ఎండమావిగా మారుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో పాఠశాలల్లో 1000 చదరపు మీటర్లు, గ్రామీణ, ఇతర ప్రాంతాల్లో 2000 చదరపు మీటర్ల ఆటస్థలం తప్పని సరిగా ఉండాలి. పాఠశాల పక్కా భవనంలో నిర్వహించాలి. కానీ చాలా పాఠశాలలు రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నాయి.

విద్యాహక్కు చట్టం ఏం చెబుతోంది..

విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం ప్రతి ప్రయివేట్ పాఠశాల యాజామాన్యం 25 శాతం సీట్లలో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, వార్షిక ఆదాయం రూ.60 వేలలోపు ఉన్నవారి పిల్లలకు 6 శాతం, అనాథలకు 5 శాతం సీట్లు కేటాయించి ఉచిత విద్యనందించాలి. ప్రయివేట్ పాఠశాలలు అమలు చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. సెక్షన్ 13 ప్రకారం విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకునేందుకు ఎలాంటి పరీక్షలూ నిర్వహించకూడదు. కానీ కొన్ని పాఠశాలలు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తూ తల్లిదండ్రుల నుంచి డబ్బు మింగుతున్నాయి. సెక్షన్ 23 ప్రకారం డిఎడ్, బిఎడ్ పూర్తి చేసిన వారిని ఉపాధ్యాయులుగా నియమించాలి. కానీ చాలా పాఠశాలలు పది, ఇంటర్, డిగ్రీ చదివిన వారితో పాఠాలు బోధిస్తున్నాయి. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ నిబంధనలను పాటించకుండా దోపిడీకి పాల్పడుతున్నా, ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప, వారిపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. విద్యాధికారులు పర్యవేక్షణను గాలికొదిలేయడంతో ప్రయివేట్ యాజమాన్యాలు, కార్పొరేట్ బడులు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయి.



నిబంధనలు తప్పనిసరి పాటించాలి

ప్రయివేట్ పాఠశాలలు అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఆటస్థలం ఉండేలా చూసుకోవాలి. నిబంధనలు ఉల్లగించినట్లు మా దృష్టికి వస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

- వెంకట రంగారెడ్డి, డిఇఒ.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కర్నూలుకు చేరిన బస్సుయాత్రం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే మున్సిపల్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం పైన దండయాత్రకు సిద్ధం కావాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం కార్మికులకు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హిందూపురంలో ప్రారంభమైన బస్సు యాత్ర శుక్రవారం కర్నూలు నగరానికి చేరుకుంది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు అధ్యక్షతన కర్నూలు ఏడవ డివిజన్‌లో సభ నిర్వహించారు. ఈ సభలో నాగభూషణం మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి రాకముందు కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం ఇస్తానని హామీ ఇచ్చాడని నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటివరకు హామీ నెరవేరలేదని విమర్శించారు. హామీలు అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతాలు నిర్వహిస్తుందని తెలిపారు. మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో కలిపి ఉద్యోగులుగా గుర్తించి నామిని డబ్బాలు కొట్టుకుంటున్నారని కానీ ఉద్యోగులకు వర్తించే ఏ సౌకర్యం మున్సిపల్ కార్మికులకు అందడం లేదని విమర్శించారు. పిఆర్‌సిలో ప్రారంభ వేతనం రూ.22,000 ఉండగా మున్సిపల్ కార్మికులకు మాత్రం రూ.15000 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం రూ. 9000 వరకు మాత్రమే ఇచ్చి క్లాప్ డ్రైవర్లను శ్రమ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పారిశుద్ధ కార్మికులు ఎంతో కష్టపడి పని చేస్తున్నా వారికి సరైన వేతనం లభించడం లేదని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులు అనేక వ్యయ ప్రయాసలకు లోనై పనిచేస్తున్న తగిన వేతనం లభించడం లేదన్నారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి. నిర్మల మాట్లాడుతూ కర్నూలు కార్పొరేషన్‌లో కార్మికుల సంఖ్యను పెంచి పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ముత్యాలరావు, నాగరాజు, లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, రాధాకృష్ణ, సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయ్ న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, సాయిబాబా, నగరనాయకులు రాముడు రామకృష్ణ ఆటో వర్కర్ యూనియన్ నాయకులు నాయకులు మహమూద్ చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు అక్బర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఓబులేసు, ఎస్తేరమ్మ పాల్గొన్నారు. కర్నూలు నగరం మీదుగా నంద్యాల జిల్లా నందికొట్కూరు, ఆత్మకూరు, బేతంచెర్ల నగర పంచాయతీలో రాత్రి బసచేశారు. ఆయా మున్సిపాలిటీలలో బస్సుయాత్రకు స్థానిక సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ నాయకులు, కార్మికులు స్వాగతం పలికారు.



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

సురక్షిత ప్రయాణానికి మారుపేరు ఆర్‌టిసి

- ప్రిన్సిపల్ సెక్రెటరీ సందర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డ్రైవర్లందరూ సురక్షిత ప్రయాణానికి మారుపేరుగా నిలవాలని ఎపి ప్రిన్సిపల్ సెక్రెటరీ పిఎస్ .ప్రద్యుమ్న సూచించారు. శుక్రవారం ఆర్‌టిసి జోనల్ శిక్షణా కళాశాలను ఆంధ్ర ప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పిఎస్.ప్రద్యుమ్న సందర్శించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. తదనంతరం 26 మంది ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లందరూ సురక్షిత ప్రయాణానికి మారుపేరుగా ఆర్‌టిసిని నిలబెట్టాలన్నారు. ప్రయాణీకులతో మర్యాదపూర్వక ప్రవర్తన ద్వారా సంస్థను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ అధికారి టివి. రామం , డిప్యూటి చీఫ్ మెకానికల్ ఇంజినీరు రజియా సుల్తానా , డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు రమణ , కర్నూలు-1 డిపో మేనేజరు సుధారాణి, కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుస్సేన్ , శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ రవి, డిపోల డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు ప్రాధాన్యత

-వైఎస్ఎర్ యంత్ర సేవా పథకం పరికరాలు పంపిణీ
- 159 రైతు గ్రూపుల బ్యాంకు ఖాతాలకు రూ.4.61 కోట్ల సబ్సిడీ జమ
- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శుక్రవారం వైఎస్ఆర్ యంత్రసేవా పథకంలో భాగంగా 159 రైతు గ్రూపులకు 96 ట్రాక్టర్లు, 1 కంబైన్ హార్వెస్టర్లు, 442 ఇతర వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాగే 159 రైతు గ్రూపు బ్యాంకు ఖాతాలకు రూ.4.61 కోట్లను జమ చేసినట్లు పేర్కొన్నారు. వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం మెగా మేళా-2 ద్వారా రైతులకు అందజేసిన యంత్రాలు, సబ్సిడీ నగదును గుంటూరు చుట్టుగుంట నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. రైతులకు ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాల మెగా పంపిణీ, రైతు గ్రూపు బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని బటన్ నొక్కి జమ చేసే కార్యక్రమాన్నిబళ్లారి రోడ్డులోని సెయింట్ క్లారెట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కలెక్టర్ సృజన, జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బివై.రామయ్య, మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఎన్నో ఉపయుక్త పథకాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు. తద్వారా రైతుల జీవన జీవన ప్రమాణాన్ని మెరుగు పరుచుకోవడానికి కృషి చేస్తోందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో కురిసే వర్షాల కంటే ముందు రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్లు, ఇతర పనిముట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం ద్వారా జిల్లాలోని ఆర్‌బికెలకు ట్రాక్టర్,పనిముట్ల రూపంలో రూ.15 లక్షల విలువ చేసే యంత్రాలను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఇందులో 50 శాతం తక్కువ వడ్డీతో బ్యాంకు రుణం, 10 శాతం రైతుల సహకారంతో పాటు 40 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అనంతరం జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ రైతుల పక్షపాతి అని, రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన వ్యక్తి అని తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేశారని, రైతులకు వ్యవసాయం ఒక పండుగలా ఉండేదని తెలిపారు. ప్రస్తుతం వైసిపి హయాంలో ఈనాటి వరకు ఏ ఒక్క మండలం కూడా కరువు మండలంగా లేదన్నారు. నగర మేయర్ బివై.రామయ్య మాడారు.అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే రూ.4.66 కోట్ల మెగా చెక్కును రైతు గ్రూపులకు అందించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, ఎల్‌డిఎం రామచంద్ర రావు, డిసిసి డైరెక్టర్ రమణారెడ్డి, డిసిసిబి బ్యాంకు సిఇఒ రామాంజనేయులు పాల్గొన్నారు.



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న కలెక్టర్



చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి పురష్కరించుకుని "పర్యావరణ రక్షణ - ప్లాస్టిక్ నిర్మూలన పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ శాస్త్రసాంకేతిక మండలి, విద్యా శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా ప్రజలలో అవగాహన కల్పించడంతో పాటు సమాజంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించే దిశగా అడుగులు వేయాలన్నారు. అందుకు గాను విద్యార్థి దశ నుండే పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులకు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ గ్లాసెస్ కి బదులుగా స్టీల్ బాటిల్స్, స్టీల్ గ్లాసెస్ తప్పనిసరిగా వినియోగించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నేటి పారిశ్రామికీకరణ యుగంలో, పర్యావరణం గురించి ఆలోచించడం చాలా ముఖ్యమని, పెరుగుతున్న కాలుష్య సమస్యలను అధిగమించడానికి ఏకైక మార్గం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణాన్ని పచ్చగా మార్చడమేనన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ వీలైనని మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి అన్నారు. చెట్ల సంరక్షణ పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రతి సంవత్సరం కొత్త థీమ్‌తో జరుపుకుంటారని, ఈసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2023 థీమ్ "బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్" అన్నారు. సిపిఒ అప్పలకొండ, జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి, సర్వ శిక్ష అభియాన్ పిఒ వేణుగోపాల్, జిల్లా సైన్స్ ఆఫీసర్ రంగమ్మ పాల్గొన్నారు.

రూ.9 లక్షల ఆర్థిక సాయం అందజేత

కర్నూలు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఆదేశాలమేరకు బాధితులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం 9 మందికి రూ.9 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి ఈనెల ఒకటిన పత్తికొండకు వచ్చిన సందర్భంగా బాధితులు ముఖ్యమంత్రి మొరపెటుకున్నారు. ఈ ఈమేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య, డిఆర్ఓ నాగేశ్వరరావు బాధితులకు అందజేశారు. పత్తికొండకు చెందిన కె.సావిత్రి, కౌతాళం మండలం తోవి గ్రామానికి చెందిన టి నరసింహులు , కర్నూలు నగరానికి చెందిన మెహరున్నీసా , మద్దికెర మండలం, గురజాల గ్రామానికి చెందిన పి.దిలీప్ కుమార్ రెడ్డి , నందవరం మండలం సోమల గూడూరు గ్రామం బోయ నర్సింహులు, పత్తికొండ మండలం, నక్కల దొడ్డి గ్రామానికి చెందిన కె.రంగమ్మ, ఆలూరు మండలం, కోటవీధి కి చెందిన పి. చిదానందం తన కుమారుడు ఈరన్న, ఆదోని మండలం, ఆదోని గ్రామానికి చెందిన కురవ లక్ష్మి , పత్తికొండ గ్రామం ఎల్ మహేష్ వారి ఆనారోగ్య, ఆర్థిక సమస్యలను ముఖ్యమంత్రికి విన్నవించుకున్నారు. వారి విన్నపాలను మన్నించిన ముఖ్యమంత్రి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందించారు.



బిర్యానీ మండిహోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలో బరాక్ ల్యావిష్‌లాంచ్ బిర్యానీ అండ్ మండి హోటల్‌ను కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ. హఫీజ్ ఖాన్ గురువారం రాత్రి యుకాన్ ప్లాజాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి రుచికరమైన నాన్‌వెజ్ మండి బిర్యాని వంటకాలను ప్రజలకు అందించాలని కోరారు. హోటల్ మేనేజింగ్ డైరెక్టర్లు మహమ్మద్ షఫాద్, ఎస్ఎండి.ఇమ్రాన్, షేక్ సమీర్, కెఎం.సర్జిల్ హుస్సేన్, ఎస్.షాహనావాజ్ మాట్లాడుతూ హోటల్‌లో ఆధునిక వంటలతో నాన్ వెజ్ కేటగిరిలో పలు రకాల స్పెషల్ ఐటమ్‌లను ప్రజల అభిరుచులకు అనుగుణంగా వండి వార్చుతున్నామని చెప్పారు. ప్రజలు తమను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యూనిస్, షాషావలి, ఫర్హాజ్ ఖాన్, జిల్లా వక్ఫ్ బోర్డ్ కమిటీ మెంబర్ టిఎండి ఫిరోజ్, ఎపి స్టేట్ హస్ కమిటీ మెంబర్ మన్సూర్ అహ్మద్ ,వైసిపి నాయకులు చాట్ల నవీన్, చిన్న బాబు, కృష్ణ కాంత్ శర్మ, మహేష్, సతీష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభానికి భవనాలు సిద్ధం

ప్రజాశక్తి-సి బెళగల్



సి బెళగల్ మండలం పోలకల్‌లో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు ఎంపిడిఒ రాముడు పేర్కొన్నారు. శుక్రవారం భవనాలలో తగు సామాగ్రిని, ఫర్నిచర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడే త్వరలో ప్రారంభం తేదీనీ ఖరారు చేస్తామని సిబ్బంది, గ్రామస్తులు తప్పక హాజరు కావాలని కోరారు.

భూ సర్వే ముమ్మరం

ప్రజాశక్తి-సి బెళగల్



సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డిలో భూ సర్వేను తహసీల్దార్ శివశంకర్ నాయక్ ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం భూ సర్వేలో పాల్గొని సిబ్బందికి తగు సూచనలు అందించారు. రైతులకు ముున్ముందు ఎలాంటి భూ సమస్యలు రాకుండా దృష్టి సారించాలని అన్నారు. సమస్యలు లేకుండా చేయడమే భూ సర్వేను ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు.

కోడుమూరుపై ముఖ్యమంత్రి వివక్ష : సిపిఎం



సమావేశంలో మాట్లాడుతున్న కెవి.నారాయణ

ప్రజాశక్తి-కోడుమూరు: ఎస్‌సి నియోజకవర్గమైన కోడుమూరు అభివృద్ధికి సరయిన నిధులు కేటాయించకుండా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వివక్ష చూపుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెవి.నారాయణ అన్నారు. పత్తికొండ ప్రాంతంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని, ఆనియన్ పొడి తయారు చేసే పరిశ్రమను ఏర్పాటు చేస్తామని, ఈ ప్రాంత ప్రజానీకాన్ని ఆదుకుంటామని వాగ్దానాలు చేయడం మంచిదేనని, వాటిని అమలు చేసి వెనుకబడిన ఆ ప్రాంతాన్ని ఆదుకుంటే స్వాగతిస్తామని అన్నారు. కోడుమూరు సిపిఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జిల్లాకు ఇచ్చిన వాగ్దానాలు మాటలు నీటిమూటలు కాకుండా ఆచరణలో పెట్టాలని అన్నారు. ఎస్‌సి నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని భారత రాజ్యాంగంలో ఉందన్నారు. సామాజిక న్యాయం గురించి తరుచూ మాట్లాడే ముఖ్యమంత్రి రాజ్యాంగంలోని అంశాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కోడుమూరుఅభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని ఆయన విమర్శించారు. తుంగభద్ర నదిలో ఎగువ నుండి వచ్చిన వర్షపు నీరు సముద్రం పాలు అయిపోతుందని, గుండ్రేవుల దగ్గర రిజర్వాయర్ నిర్మాణం చేస్తే 20 టిఎంసిల నీటిని నిలువ చేసుకోవచ్చన్నారు. దానివల్ల ఈ ప్రాంతం సాగు, తాగునీరు సమస్య తీరుతుందన్నారు. పులకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే ఈ ప్రాంతానికి సాగునీరు అందించవచ్చన్నారు. బై దొడ్డి దగ్గర స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేస్తే కోడుమూరుకు తాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. ఇలాంటివి ఏ ఒక్కటి కూడా పట్టించుకోకుండా ఎస్‌సి నియోజకవర్గ పట్ల వివక్షత చూపడం సరైంది కాదని విమర్శించారు. సిపిఎంగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం నియోజకవర్గ సమస్యలు తీసుకొని దశలవారీగా పోరాటాలు చేయడానికి సిద్ధమవుతున్నామని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఎంఎస్ఎ. గఫూర్ మియా, కె.రాజు, టి.వీరన్న, కె.లక్ష్మన్న, పి,వీరన్న, ఎం.అశోక్ పాల్గొన్నారు.

బడి స్థలానికి ఇచ్చిన అక్రమపట్టాను రద్దుచేయాలి



మాట్లాడుతున్న టి.రాముడు

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో ఉన్న ఎయిడెడ్ స్కూల్ కొట్టంబడి స్థలాన్ని కాపాడి వార్డు ప్రజలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కొట్టం బడి పూర్వపు విద్యార్థులు, వార్డు అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం పూర్వపు విద్యార్థి ఎస్.రోశయ్య అధ్యక్షత వహించారు. వార్డు కార్పొరేటర్ జి.మునెమ్మ, మాజీ కార్పొరేటర్ టి.రాముడు, అఖిలపక్ష నాయకులు మల్లికార్జున, యేసన్న, కరుణాకర్,రవి, నాగేశ్వరరావు, అరుణ, వెంకటయ్య, ఎల్లా కష్ణ, ఏ.శ్రీనివాసులు, మా బాష మాట్లాడారు. అన్యాక్రాంతమైన కొట్టం బడి స్థలాన్ని కాపాడాలని, బడి స్థలానికి అక్రమంగా ఇచ్చిన పట్టాను రద్దు చేయాలని, కొట్టంబడి స్థలంలో సచివాలయం లేదా కమ్యూనిటీ హాల్ లేదా గ్రంథాలయం నిర్మించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమానికి మద్దతుగా వెయ్యిమంది వార్డు ప్రజలతో సంతకాలు సేకరించారు. ఆ ఆందోళన కొనసాగింపుగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయాలని, స్పందనలో కలెక్టర్‌కు సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించాలని పూర్వపు విద్యార్థులు, అఖిలపక్ష నాయకులు నిర్ణయించారు. పూర్వపు విద్యార్థులు మద్దిలేటి ,లోకేష్, అన్నయ్య, విక్రం, రాజు, వీధి పెద్దలు వీధి ప్రజలు పాల్గొన్నారు.

పత్తికొండకు రూ.వంద కోట్లు మంజూరు : ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-పత్తికొండ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

పత్తికొండ నియోజకవర్గనికి రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు సిఎం జగన్మోహన్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పత్తికొండ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన టమోటా ప్రాసెసింగ్ ఏర్పాటుకు సత్వరమే చర్యలు తీసుకొని, ఫౌండేషన్ స్టోన్ ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులకు సిఎం అప్పటికప్పుడే ఆదేశాలు ఇచ్చారని, రూ.10 కోట్లు విడుదల చేశారనీ తెలిపారు. పత్తికొండ ప్రాంతంలో లిఫ్ట్ ఏర్పాటు చేసేందుకు కూడా ప్రతిపాదనలు సిఎం ముందు ఉంచామని తెలిపారు. క్రిష్ణగిరి మండలం గోకులపాడు వద్ద రూ.7.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి సిఎం జగనన్న సుముఖత వ్యక్తం చేశారన్నారు. పత్తికొండ బాలికలకు అధునాతనమైన హాస్టల్ వసతి కల్పించేందుకు నిధులు విడుదల చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నారాయణదాసు మండల కన్వీనర్ కారం నాగరాజు, మాజీ సర్పంచి సోమశేఖర్ కోఆప్షన్‌సభ్యులు నజీర్, ఎంపిటిసి నీలకంత, వైసిపి నాయకులు నాగరాజు, గుండు జిలాన్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసిన జిల్లా కలెక్టర్ జి.సృజన, ఎస్‌పి జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య , సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్‌డిఒ మోహన్ దాసు, ఇతర అధికారులకు , సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



సంక్షేమ పథకాలను వివిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

అర్హులకు సంక్షేమ పథకాలు : కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామనీ ఎమ్మెల్యే కాటసానిరాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు మండలం ఓబుళాపురం తండా గ్రామాలలో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్యెల్యే గ్రామాలలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఎంపిపి బోయ శారద, ఓబుళాపురం, తండా గ్రామ నాయకులు వెంకట రాముడు, అంజన్ నాయక్, తడకనపల్లె కృష్ణా రెడ్డి, జి.సామన్న, సల్కాపురం సర్పంచి మద్దిలేటి, కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత్ రెడ్డి, కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర రెడ్డి, చిన్న టేకూరు కురువ ఈశ్వరయ్య, దూపాడు నాగేశ్వరరెడ్డి, సత్యం రెడ్డి, మండల స్థాయి అధికారులు, నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి తుగ్గలి



విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మండలం పరిధి .లోని జొన్నగిరి గ్రామంలో రైతులకు సబ్సిడీ పై వేరుశనగ విత్తనాలను వైస్ ఎంపిపి ఎర్ర నాగప్ప, విద్యా కమిటీ చైర్మన్ గుంత రాఘవేంద్ర శుక్రవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలను అందజేశారన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు అన్ని గ్రామాలలో దశలవారిగా రైతులకు విత్తనాలను వ్యవసాయ అధికారులు అందిస్తున్నారని, ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఖరీఫ్ సమీపిస్తున్న సమయంలో రైతులకు వేరుశనగ విత్తనాలు అందించడం హర్షించ దగ్గర విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కురువలకు సముచిత స్థానం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం



ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో కురువలకు సముచిత స్థానం కల్పించినట్లు మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం కౌతాళంలో కనకదాసు విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కూడా కురువలకు ప్రాముఖ్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు కురువలకు ఇచ్చిన మాట ప్రకారం, అత్యధిక సర్పంచి స్థానాలు, మండల అధ్యక్ష పదవితో పాటు వారి ఆరాధ్య దైవమైన కనకదాసు విగ్రహం ఏర్పాటుకు వైఎస్ఆర్ సర్కిల్‌లో స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంతో సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూసినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. అంతకుముందు మండల అధ్యక్షులు అమ్రేష్, కురువ సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాల నాగిరెడ్డిని ఘనంగా సన్మానించారు. శివరాం, ఉప్పలప్ప, రమేష్, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, నాయకులు పాల్గొన్నారు.

వైసిపితోనే అభివృద్ధి

- నియోజకవర్గ సీనియర్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ప్రభుత్వ లబ్ధి పత్రాలు అందజేస్తున్న జగన్మోహన్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 34వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గడపగడపకు తిరిగి ఆయా ఇళ్లలో లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్ లెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వార్డులో నీటి సమస్యను కాలనీవాసులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు పరిధిలో తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. వైసిపి నాయకులు, కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జీలు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కెసిటిఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- టోర్నీని ప్రారంభించిన కెసి.తిమ్మారెడ్డి వారసులు

ప్రజాశక్తి - హోళగుంద

ఇంగలదహాల్ గ్రామంలో గ్రామ అధిపతి, గ్రామ సేవకుడిగా ఎన్నో సేవలు చేసిన వ్యక్తి కీర్తిశేషులు కెసి.తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం టెన్నిస్‌బాల్ ఓపెన్ టోర్నమెంట్‌ను తిమ్మారెడ్డి వారసులు ప్రారంభించారు. శుక్రవారం తిమ్మారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మ్యాచ్‌ను ప్రారంభించారు. తిమ్మారెడ్డి వారసులు కార్తీక్ రెడ్డి, సందీప్ రెడ్డి, వైస్ ఎంపిపి కెంచప్ప, ఎంపిటిసి మల్లికార్జున మాట్లాడుతూ... గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అలాగే ఈ పోటీల్లో గెలుపోటములను అందరూ సమానంగా స్వీకరించాలని చెప్పారు. ఎలాంటి గొడవలూ లేకుండా ఐకమత్యంతో ఆడాలని కోరారు. మొదటి మ్యాచ్‌లో పెద్దహరివాణం, ఎమ్‌డి.హళ్లి జట్లు తలపడ్డాయి. ఇందులో ఎమ్‌డి.హళ్లి జట్టు 71 పరుగులు చేయగా పెద్దహరివాణం జట్టు 72 పరుగులు చేసి విజయాన్ని నమోదు చేసింది. పెద్దహరివాణం జట్టు సభ్యులు వెంకటేష్ 4 వికెట్లు తీసి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అందుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అభినయ్ రెడ్డి, వినయ్ రెడ్డి, హర్ష రెడ్డి, ఆర్గనైజర్లు ఎంపిటిసి మల్లికార్జున, తిమ్మప్ప, మాస, వీరేష్, రాజు, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న తిమ్మారెడ్డి వారసులు

లోన్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ శివ నారాయణస్వామి

ప్రజాశక్తి - ఆదోని

రుణాల పేరుతో ఫోన్ కాల్స్ చేసి మాయ మాటలు చెప్పి సైబర్ క్రైమ్‌కు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వివాహాలు, శుభకార్యాలు, విహార యాత్రలకు కుటుంబ సమేతంగా వెళ్లే వారు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తూ దొంగతనాలు జరుగుతున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. లూటీలు, దొంగతనాలు జరగకుండా ముందస్తుగా తమకు సమాచార ఇస్తే ఆ ఇళ్ల పట్ల అప్రమత్తంగా ఉంటూ గస్తీ నిర్వహిస్తామన్నారు. బంగారు నగలు, విలువైన వస్తువులు సాధ్యమైనంత వరకు బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలన్నారు. కొందరు యాప్ పేర్లతో తక్కువ వడ్డీలకు రుణాలు ఇస్తామని ఫోన్ చేసి మాయమాటలు చెబుతున్నారని, అలాంటి వారి ఉచ్చులోకి పడకూడదని సూచించారు. ఎటిఎం కార్డు మార్పు అంటూ ఓటిపి ద్వారా నగదు పోగొట్టుకుంటూ, సైబర్ నేరాలకు గురైతే 1930కి, డయల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. లోన్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటికి సంబంధించిన పాంప్లెట్స్, గోడపత్రికను ప్రధాన కూడళ్లలో అంటించి ప్రజలను చైతన్య పరుస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర సమయంలో పోలీసులను సంప్రదించాలని కోరారు. డయల్ 100/112 నెంబర్లు అందుబాటులో ఉంటాయని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శివారు ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సిఐలు విక్రమ్ సింహ, శ్రీనివాస్ నాయక్, నరసింహారాజు, ఎస్ఐ పీరయ్య, సచివాలయం మహిళా పోలీసులు ఉన్నారు.



అవగాహన గోడపత్రికను విడుదల చేస్తున్న డీఎస్పీ

ఫ్లెక్సీలో పవన్ కల్యాణ్ ఫొటో తొలగించాలి

- జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం



ఫ్లెక్సీని చూపుతున్న నాయకులు

'పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం' అనే పేరుతో స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఫొటోను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న కోరారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎఎస్ఐ ఆనంద్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్లెక్సీలో వేసిన ఫొటో పవన్ కల్యాణ్‌ను కించపరిచే విధంగా ఉందని తెలిపారు. దాని కారణంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్ కల్యాణ్ అభిమానుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలో పల్లకిలో చంద్రబాబు నాయుడును, లోకేష్‌ను కూర్చోబెట్టుకొని పవన్ కల్యాణ్ మోస్తున్నట్లుగా చిత్రీకరించడం బాధాకరమన్నారు. ఒక పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్‌ను అవమానించారని, జనసేన నాయకులు, కార్యకర్తలు పవన్ కల్యాణ్ అభిమానుల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టినట్లు తెలిపారు. ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించారని, ఫ్లెక్సీని తొలగిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. జనసేన పార్టీ కార్యకర్తలు ఏసోబు, వెంకటేష్, టిపి.రాఘవేంద్ర, బిబిసి చిన్న, కాశీం, ఉసేని, గురుస్వామి పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో

తిక్కారెడ్డి పుట్టిన రోజు వేడుక

ప్రజాశక్తి - మంత్రాలయం



తిక్కారెడ్డికి కేక్ తినిపిస్తున్న చంద్రబాబు

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి పుట్టినరోజు వేడుకను జరుపుకున్నారు. శుక్రవారం తిక్కారెడ్డి పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో చంద్రబాబును కలిశారు. తన పుట్టినరోజు అని చెప్పడంతో అక్కడే కేక్ ఏర్పాటు చేసి తిక్కారెడ్డితో కేక్ కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు తిక్కారెడ్డికికి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో టిడిపిని బలోపేతం చేయాలని, రానున్న ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధించాలని కోరారు.

మంత్రాలయంలో సంబరాలు

తిక్కారెడ్డి పుట్టినరోజు వేడుకలను నాయకులు, కార్యకర్తల మధ్య సంబరాలు జరుపుకున్నారు. శాంతినికేతన్ రెసిడెన్సి ఆవరణంలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ స్వామి ఆధ్వర్యంలో తిక్కారెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి నాయకులు ఒకరికొకరు తినిపించుకొని తిక్కారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నాయకులు పూజారి గోపాలకృష్ణ స్వామి, ఎంపిటిసి వెంకటేష్, చెట్నిహల్లి మాజీ ఎంపిటిసి ఈరన్న, నాయకులు విజయరామిరెడ్డి, అశోక్ రెడ్డి, వట్టేప్ప గారి సుంకప్ప, వట్టేప్ప గారి నరసింహులు, వనికె నాగరాజు, కలుదేవకుంట రాగన్న పాల్గొన్నారు.



మంత్రాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

వైభవంగా ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉరుసు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం 319వ ఉరుసు సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో పుణ్యక్షేత్రం జనసంద్రమైంది. తెల్లవారుజామున దర్గా పీఠాధిపతుల ఇంటి నుంచి గంధోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులు భారీగా తరలివచ్చి దర్గాలో పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటికీ బంధువులు రావడంతో గ్రామమంతా పండగ వాతావరణం నెలకొంది.

ఉత్సాహంగా, ఉల్లాసంగా : ఉరుసు ఉత్సవాల్లో ఆట వస్తువులు, గాజుల అంగళ్లు, మిఠాయి అంగళ్లు కిటకిటలాడాయి. పిల్లలు, విద్యార్థులు ఉయ్యాలలు, ఎగ్జిబిషన్, జంపింగ్ కేంద్రాల వద్ద ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆనందాన్ని పొందారు.

స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి : శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి సన్నిధిలో మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పూజలు నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ మున్నా పాషా సాహెబ్ ఘనంగా ఆహ్వానించి, సన్మానించి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వివిధ పార్టీల నాయకులు దర్గాను సందర్శించి పూజలు నిర్వహించారు.



దర్గా ఆవరణలో ఉన్న భక్తులు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



మాట్లాడుతున్న వైసిపి కన్వీనర్ ఏరూరు రంగస్వామి

7,607 మంది రైతులకు రైతు భరోసా ద్వారా లబ్ధి

- వైసిపి కన్వీనర్ రంగస్వామి

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలంలో రైతు భరోసా పథకం కింద 7,607 మంది రైతులు లబ్ధి పొందారని వైసిపి కన్వీనర్ ఏరూరు రంగస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన చిప్పగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో మండలంలో 7,607 మంది రైతులకు రూ.5,52,07,500 వచ్చాయన్నారు. ఒక్క ఏరూరు గ్రామంలోనే 680 మంది లబ్ధిదారులకు రూ.37.40 లక్షలు వచ్చాయని తెలిపారు. అందులో ఎక్కువ భాగం టిడిపికి చెందిన వారే ఉన్నారన్నారు. ఇప్పటికీ ముఖ్యమంత్రి జగన్ ప్రతిసారి కూడా పార్టీలు చూడకుండా అర్హత ఉన్న అందరికీ పథకాలను వర్తింపజేస్తున్నారని చెప్పారు.

రోడ్డుపై గ్రావెల్ వేయడం నేరం : కుందనగుర్తి బస్సు స్టేజీ నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన మంత్రి సడక్ రోడ్డుపై గ్రావెల్ వేయడం నేరమని, రోడ్డు ప్యాచ్ వర్క్ కోసం రూ.6.50 లక్షలు మంజూరయ్యాయని, అందుకు విరుద్ధంగా రోడ్డుపై గ్రావెల్ వేయడం సర్పంచికి తగదని రంగస్వామి దుయ్యబట్టారు. నిధులు వెనక్కి వెళ్లేందుకు సర్పంచి కారకులవుతున్నారని తెలిపారు. పంచాయతీరాజ్ ఎఇ, డిఇ చర్యలు తీసుకోవాలని, లేకపోతే మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిరసన చేపడతామన్నారు. ఆర్‌బికె ఛైర్మన్ రంగముని పాల్గొన్నారు.

ఎస్సీ కులాల రాజ్యాంగ ఫలాల కోసం పోరాటం

- నాగరాజు గౌడ్

ప్రజాశక్తి - ఆదోని



ఆంధ్రప్రదేశ్ ఎస్సీ జాబితాలోని 57 ఉప కులాలకు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కుల కోసం పోరాటానికి సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ 57 ఉపకులాల రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ రైట్స్ ఫోరం జాతీయ కన్వీనర్ నాగరాజు కోరారు. విజయవాడలో జరిగిన ఎస్సీ ఉపకులాల సమావేశంలో తనను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసిన జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేష్ మోచికి శుక్రవారం ఆదోనిలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ జాబితాలో ఉన్న కులాలకు రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డ హక్కులు నేటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఎస్సీ జాబితాలో ఉన్న వారికి కనీసం రాష్ట్రంలో కుల ధ్రువీకరణ పత్రాలు కూడా అధికారులు మంజూరు చేయడం లేదన్నారు. ఇప్పటికీ ఎస్సీ కుల జాబితాలో ఉన్న 57 కులాల వారిని ప్రభుత్వం ఓటు వేసే యంత్రాలుగా చూస్తోందని విమర్శించారు. ఎస్సీ జాబితాలో ఉన్న అన్ని కులాల వారికి ధ్రువీకరణ పత్రాలు, సబ్‌ప్లాన్ నిధులు అందేవిధంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్‌ల స్ఫూర్తితో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.



పింఛనుదారులతో వాలంటీరు

నిబంధనలు గాలికి...

ప్రజాశక్తి - ఆదోని

పార్టీలకతీతంగా లబ్ధిదారులకు పథకాలు ఇవ్వాల్సిన కొందరు వాలంటీర్లు నిబంధనలను గాలికొదిలేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం పాకులాడుతున్న సందర్భాలు చోటు చేసుకుంటున్నాయి. ఆదోని పట్టణంలోని 1వ వార్డు వాల్మీకి నగర్‌లో టిడిపి కౌన్సిలర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదని పలు సందర్భాల్లో ఆమె అధికారులకు ఫిర్యాదు చేసిన దాఖలాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ అధికార పార్టీ నాయకులకు కొందరు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. ఇంటింటికీ తిరిగి వృద్ధులకు పింఛను ఇవ్వాల్సిన వాలంటీరు ఒకే చోటకు అందరిని పిలిపించి కరపత్రాలు ఇస్తూ పథకాలను వివరించడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు జోక్యం చేసుకొని వాలంటీర్లు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని వార్డు వెల్ఫేర్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లగా విచారించి వివరాలు తెలుసుకుంటామని తెలిపారు.

చిరుత పులులను సంరక్షించండి

- వన్యప్రాణుల కార్యకర్తలు దైవ ప్రసాద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డివిజన్ పరిధిలోని కోసిగి గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న చిరుత పులులను సంరక్షించాలని వన్యప్రాణుల కార్యకర్తలు దైవ ప్రసాద్, మూర్తి, వెంకటేష్ కోరారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కోసిగి పరిసర కొండల్లో చిరుత పులుల సంచారం ఉన్నట్లు గత ఆరు నెలలుగా వార్తపత్రికల ద్వారా తెలుస్తోందన్నారు. ఆఫ్రికా దేశం నుంచి నాలుగు చిరుత పులులను దిగుమతి చేసుకున్న విషయం తెలిసిందేనని అన్నారు. కోసిగి పరిసర ప్రాంత కొండలు కొన్నింటిని చిరుత పులుల రక్షిత అడవులుగా ప్రకటించి వాటిని సంరక్షించాలని కోరారు.

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం

- మండల ప్రజలకు కృతజ్ఞతలు - పార్టీ అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధం - వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పత్తికొండ పర్యటన విజయవంతమైందని వైసిపి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, సర్పంచి అరుణ్ కుమార్ మాట్లాడారు. పట్టణంలో రైతు భరోసా ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమం విజయవంతం చేసినందుకు మండల ప్రజలకు, గ్రామస్తులకు, వైసిపి కార్యకర్తలకు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి చేస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రైతులు అభివృద్ధి చెందేందుకు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా, రైతు గ్రూపులకు రాయితీతో యంత్ర సేవా పథకం కింద వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు అందించినట్లు తెలిపారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీతో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచడం హర్షించదగ్గ విషయమన్నారు.

అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధం : కర్నూలు పార్లమెంట్ నియోజవర్గ స్థాయిలో ఉంటూ వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంచి గుర్తింపు పొందిన తనకు వైసిపి అధిష్టానం అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆలూరు నియోజవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు తాను సిద్ధమని తెర్నేకల్ గ్రామ సీనియర్ వైసిపి నాయకులు సూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపిపి లక్ష్మీదేవి భర్త ఉమాంబ, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, ఉప సర్పంచి భర్త బెల్ ఈరన్న, మాజీ ఎంపిటిసిలు చాప వీరన్న, రాఘవేంద్ర, వైసిపి యూత్ నాయకులు రామ్ నాయుడు, పులి నరేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెర్నేకల్ సురేందర్ రెడ్డి

మేనిఫెస్టోతో యువత భవితకు భరోసా

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోతో యువత భవితకు భరోసా కల్పిస్తున్నట్లు మాజీ ఎంపిటిసి మల్లికార్జున, టిడిపి యూత్ కన్వీనర్ రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు స్థానిక గాంధీ పార్కు వద్ద చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువతకు ఉపాధి లక్ష్యంగా 20 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ యువతకు రూ.3 వేలు, 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు రూ.1500 ఆర్థిక సహాయం, ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, దీపం పథకం కింద ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు, బీసీలకు రక్షణ చట్టాలు వంటి వాటిని మహానాడులో ప్రకటించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ఈ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేస్తామని పేర్కొన్నారు. టిడిపి నాయకులు సతీష్, తెలుగు యువత నాయకులు పూజారి మహేష్, మారేష్, మహానంది, మల్లేష్, రంగస్వామి, సంజీవ, శంకర్, ఉదయ్ పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలి : మాల మహానాడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని మాల మహానాడు నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల నరసన్న, జిల్లా కార్యదర్శి దత్తు, తాలూకా అధ్యక్షులు బుడుమెద్దుల రవిచంద్ర, పట్టణ అధ్యక్షులు ఎద్దుల చెన్నయ్యలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడార. బీసీ-డి కులానికి చెందిన మాల దాసరి కులం వారు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకొని ఉద్యోగాలు పొందుతున్నారని తెలిపారు. దైవందిన్నె, పార్లపల్లె, బనవాసి, టిఎస్.కూలూరు, ఎర్రకోట గ్రామాల్లో మాల దాసరి కులం వారు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకొని ఉద్యోగాలు పొందుతున్నారని, వెంటనే వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాల ద్వారా కుల సర్టిఫికెట్లు పొంది ఉద్యోగాలు పొందుతుంటే, నిజంగా ఎస్సీ కులానికి చెందిన వారు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని తెలిపారు. అధికారులు సర్టిఫికెట్లను పూర్తిగా పరిశీలించి ఎస్సీ కులస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దళితులపై గ్రామంలో రెండు గ్లాసులు పద్ధతిని విడనాడాలని తెలిపారు. మాలలకు శ్మశాన వాటిక స్థలాన్ని ప్రతి గ్రామంలో కేటాయించాలని కోరారు. కుల వివక్ష, దళిత మహిళలపై దాడులు చేసిన వారిని పోలీసులు దర్యాప్తు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. మాల మాహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పేద కుటుంబాలను ఆదుకోవడంలోనే సంతృప్తి

- మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి



ఆర్థిక సాయం అందిస్తున్న గుమ్మనూరు నారాయణ

ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఏదో ఒక రూపంలో ఆర్థిక సహాయం అందిస్తే సంతృప్తికరంగా ఉంటుందని ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. శుక్రవారం నేమకల్లు గ్రామానికి చెందిన సురేంద్ర, చంద్రకళలు గుమ్మనూరు గ్రామానికి వెళ్లి తమ కూతురు పెళ్లికి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన నారాయణ దంపతులు వారి చేతికి వెంటనే నూతన వస్త్రాలతో పాటు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సాయం అందించినందుకు ఎస్సీ మండల కన్వీనర్ నాగరాజు, పెళ్లికూతురు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

శివాలయ నిర్మాణం, అభివృద్ధికి రూ.50 వేల విరాళం

హాలహర్వి మండలంలోని శిధిరహాల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి సహాయం చేయాలని ఆ గ్రామ పెద్దలు గుమ్మనూరుకు వచ్చి నారాయణను కోరారు. అందుకు నారాయణ స్పందిస్తూ 10 తరాలపాటు శాశ్వతంగా దేవాలయ నిర్మాణాలు ఉంటాయని, దేవాలయ నిర్మాణాలకు తన సహాయం ఎప్పుడూ కూడా ఉంటుందని గ్రామ పెద్దలకు తెలియజేస్తూ ఇప్పటికీ రూ.50 వేలు ఇస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో తన సహకారం ఎప్పుడూ ఉంటుందని వారికి హామీ ఇచ్చారు.

తవ్విన గుంతలను వెంటనే పూడ్చండి: కెవిపిఎస్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగరం 15వ వార్డ్ బుధవార పేట 35వ సచివాలయం పరిధిలో మంచి నీటి పైప్ లైన్ కోసం రోడ్డును తవ్వి అడ్డంగా వదిలేశారని, రోడ్డును వెంటనే మరమ్మత్తు చేయించాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జి.కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం 35 వ సచివాలయం అడ్మిన్ సురేంద్రను కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జి.కృష్ణ, వీధి యువకులు అశోక్, జె.రాజేష్, సి.రాజేష్, శివరాం, ఈశ్వర్, ఆటో డ్రైవర్ రాజేష్, భరత్, రమేష్, మహేంద్రతో కలసి వీధి సమస్యపై వినతి పత్రం ఇచ్చి సమస్య తీవ్రతను వివరించారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ కు పక్కనే ఉన్న బుధవార పేట అత్యధిక జనాభా కలిగిన అతి పెద్ద దళితవాడగా ఉందన్నారు. నగరం లోని చాలా చోట్ల గత కొన్ని సంవత్సరాల క్రితం మంచినీటి సమస్య ఉన్న ప్రతి వీధిలో పైపు లైన్ల కోసం గుంతలు తవ్వి తిరిగి వెంటనే కంకర, ఇసుక, సిమెంట్ కలిపి ప్యాచ్ వర్క్లు చేయించారన్నారు. 15 వార్డు 35వ సచివాలయం పరిధిలో అత్యంత పేద ప్రజలు నివసిస్తున్నారన్నారు. హంద్రీ నదికి ఆనుకుని ఉన్న శ్రీ భవానీ జ్యోతిర్లింగ శివాలయం మొదలుకొని చుట్టు పక్కల ప్రజలు నివసించే పూరి గుడిసెల వీధులలో పైపు లైన్ల కోసం గుంతల తవ్వి పూడ్చకుండా నిర్లక్ష్యంగా, దళితుల పట్ల వివక్ష చూపే విధంగా కాంట్రాక్టర్ , ఉన్నత అధికారులు ప్యాచ్ వర్క్ చేయించకుడా వదిలేశారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి గుంతలను పూడ్చకపోతే ప్రజలందరినీ ఐక్యం చేసి, సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.





హార్వెస్టర్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్,ఎమ్మెల్సీ, చైర్మన్ తదితరులు

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్
- ఆత్మకూరుకు చేరుకున్న రాష్ట్ర ప్రచార జాత
-10న విజయవాడలో భారీ ధర్నా

ప్రజాశక్తి - ఆత్మకూర్

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని 2019 ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సిఎం జగన్ మాటనిలబెట్టుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, నాగేంద్రబాబు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నంలు అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రచార జాత శుక్రవారం ఆత్మకూరు పట్టణానికి చేరుకుంది. వీరికి మున్సిపల్ కార్మికులు ఘన స్వాగతం పలుకుతూ ఆర్టీసీ బస్టాండ్ నుంచి గౌడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలో దాదాపు 40 వేల మంది పైగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 40 శాతంగా ఉన్న పట్టణ ప్రజలకు పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు, రోడ్లు, పార్కులు, పౌర సేవలు అందిస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో కోవిడ్ వారియర్స్‌గా ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారన్నా రన్నారు. వీరికి 010 పద్ధతి ద్వారా జీతాలు చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, సంక్షేమ పథకాలు, సిపిఎస్ రద్దు సాధనకై మే 31వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జరుగుతున్న రాష్ట్ర ప్రచార జాతాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాలరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగరాజు, లక్ష్మీనారాయణ, గోపి, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగన్న, నాగరాజు, ప్రసాద్, జోసఫ్, దానం, తిమ్మయ్య, గొడుగురాజు, కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, స్వాములు, వీరన్న, మా బాష తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో మాట్లాడుతున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలో జాత నందికొట్కూర్ పటేల్ సెంటర్ చేరుకొంది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, మున్సిపల్ ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మిట్ చేయాలని సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యల మీద రెండు ప్రచార జాతలు వారి సమస్యలు తెలుసుకుంటూ పర్యటిస్తున్నారని, ఈ డిమాండ్ల పైన ఈనెల 10వ తేదీన విజయవాడలో భారీ ఎత్తున ధర్నా చేయడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె భాస్కర్ రెడ్డి, టౌన్ అధ్యక్షురాలు జయరామి, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు నాగన్న, ఆంజనేయులు, మున్సిపల్ కార్మికులు చాంద్బాషా, సర్వర్ ఖాన్, నాగేశ్వరరావు, వ్యాకాస జిల్లా అధ్యక్షులు నాగేశ్వరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు. తరువాయి 6లో..



నందికొట్కూరులో మాట్లాడుతున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు

అన్నదాతల కోసం యంత్ర సేవా

- 114 ట్రాక్టర్లు, 4 వరి కోత యంత్రాలు పంపిణీ - జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి అన్న దాతలను ఆదుకునేందుకు వైయస్సార్ యంత్ర సేవా పథకం కింద జిల్లాలో 153 గ్రూపులకు రూ.5.45 కోట్ల సబ్సిడీతో 114 ట్రాక్టర్లు, 4 వరి కోత యంత్రాలు పంపిణీ చేసామని జిల్లా కలెక్టర్ డాక్టంర్ మనజిర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాల్‌లో లైవ్ ద్వారా గుంటూరు జిల్లాలోని చుట్టుగుంట సర్కిల్లో ఏర్పాటు చేసిన వేదిక వద్ద వైయస్సార్ యంత్రసేవా పథకం మెగా మేళా-2లో భాగంగా రైతులకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు రాష్ట్రస్థాయి పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పి.నాగిరెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి, తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల పెట్టుబడిని తగ్గించి అధిక దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలను పంపిణీ చేసామన్నారు. ఒక్కో ట్రాక్టర్ ధర రూ.15 లక్షలు కాగా.. 50 శాతం బ్యాంకు రుణం, 40 శాతం సబ్సిడీ పోగా కేవలం 10 శాతం మాత్రమే రైతు గ్రూపు చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 153 రైతు గ్రూపులకు రూ. 545.58 లక్షల సబ్సిడీ మొత్తాన్ని జమ చేయడం జరిగిందని వివరించారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉంచేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయడంతో పాటు ఇన్పుట్ సబ్సిడీ, పంటల బీమా, ఈ క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతాంగాన్ని ఆదుకోవడం కోసం ప్రభుత్వం వైయస్సార్ యంత్ర సేవా పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా రైతు గ్రూపులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయ యంత్ర వాహనాలు పంపిణీ చేసారన్నారు. వ్యవసాయ కూలీలు పెరిగిపోతున్న పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు వ్యవసాయ వాహన, యంత్ర పరికరాలు పంపిణీ చేసి ఆదుకుంటోం దన్నారు. గ్రామస్థాయిలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సన్న, చిన్న కారు రైతులు గ్రూపుగా ఏర్పాటై రిజిస్ట్రేషన్ చేసుకుంటే ట్రాక్టర్లు, వరి కోత మిషన్లు మంజూరు చేస్తారన్నారు. శాసనమండలి సభ్యులు ఇషాక్ బాషా మాట్లాడుతూ రైతు పక్షపాతి వైసిపి ప్రభుత్వం అన్నారు. అనంతరం పంపిణీ చేసిన ట్రాక్టర్లు, వరి కోత మిషన్ల వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, పట్టు పరిశ్రమ అధికారి పరమేశ్వరి, వ్యవసాయ వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాయితీ మొత్తంతో కూడిన చెక్కును రైతులకు అందజేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

అడిషనల్ ఎస్పీ జి. వెంకటరాముడు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వ్యవస్థలో వచ్చిన అవకాశాలను విద్యార్థి లోకం అందిపుచ్చుకొని, సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. వెంకటరాముడు అన్నారు. వరల్డ్ విజన్ ఇండియా నంద్యాల ప్రాంతీయ అభివృద్ధి సంస్థ నిర్వాహకులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. వెంకటరాముడు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ కిట్స్ బ్యాగ్స్‌లను పంపిణీ చేశారు. శుక్రవారం వరల్డ్ విజన్ ఇండియా నంద్యాల ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమం తరుపున మధుమణి నర్సింగ్ హోమ్ నందుగల కాన్ఫరెన్స్ హాల్‌లో నంద్యాల మండలంలోని 8 గ్రామంలో నివసిస్తున్న 360 మంది బాలబాలికలకు ఎడ్యుకేషన్ కిట్ ప్రోగ్రాంలో భాగంగా స్కూల్ బ్యాగ్, వాటర్ బాటిల్, లంచ్ బాక్స్, పెన్సిల్ బాక్స్‌లను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఐసిఐడీఎస్ పీడీ నిర్మల, ఎంపీడీవో భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమైం దని పేద కుటుంబాలలో ఉన్న పిల్లలు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకొని ముందు రోజుల్లో మంచి విద్యావంతులుగా ఎదగాలన్నారు. వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ నంద్యాల రూరల్ గ్రామంలో ఎంతో చక్కని పని జిల్లాలో ఉన్న అధికారులతో, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పలు కార్యక్రమా లు చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల రూరల్ మండల ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ వరల్డ్ విజన్ 2019 నుండి అభివృద్ధి కార్యక్రమాలు నంద్యాల రూరల్ మండలంలో చేస్తున్నారని, పిల్లల విద్య ఆరోగ్యం భద్రత జీవనోపాదులకు సంబంధించి ఎన్నో పేద కుటుంబంలో ఉన్న పిల్లలకు చేయూత ఇచ్చారన్నారు. అనంతరం ఐసిడిఎస్ పిడి నిర్మల మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. కోవిడ్ టైంలో మరణిం చిన వారి కుటుంబంలో ఉన్న పిల్లలకు గవర్నమెంట్ తరపున ఆర్థిక సహాయం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ విజన్ సిబ్బంది తిరుపతి రావు, జెస్సి అరుణ్ కుమార్, రవికుమార్ జోషి, మదర్ సొసైటీ ఫౌండర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు కిట్లు పంపిణీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ, తదితరులు

కౌలు రైతు చట్టాన్ని సవరించాలి

-భూ యజమాని సంతకం లేకుండా కౌలు కార్డు ఇవ్వాలి - రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - ఆత్మకూర్

కౌలు రైతు చట్టాన్ని సవరించి, భూ యజమాని సంతకం తొలగించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు వి ఏసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ సాములు, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మా బాష, వీరన్న, సిఐటియు జిల్లా నాయకులు ఏ రణధీర్, తదితరులు శుక్రవారం నాడు గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉంటే కేవలం 5 లక్షల 70 వేల మందికి మాత్రమే కౌలు కార్డులను ప్రభుత్వము ఇచ్చిందన్నారు. ప్రభుత్వం తెచ్చిన దుర్మార్గమైనటువ ంటి చట్టం వల్ల భూ యజమాని సంతకం తప్పనిసరి అని ఒక జీవోను తీసుకొచ్చి కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు అందకుండా చేసిందన్నారు. లక్షలమంది కౌలుదారులకు కార్డులు అందక ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా ఇన్‌పుట్ సబ్సిడీ పంటల బీమా, తదితర పథకాలు అందక ఆత్మహత్యల పాలవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 5న అనకాపల్లి నుండి ఒక దళం జూన్ 7 తారీఖున నెల్లూరు నుండి ఒక దళం జీపు యాత్రలు ప్రారంభమ వుతున్నాయన్నారు. జూన్ 10వ తేదీన కృష్ణా జిల్లా తోట్ల వల్లూరులో సాయంత్రం 5 గంటలకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. జూన్ 12వ తారీకున విజయవాడ నుండి ప్రకాశం బ్యారేజ్ మీదుగా సీసీఎల్‌ఏ ఆఫీసు మంగళగిరికి రాయబారంలో వేలాదిగా కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు వి ఏసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ సాములు,

డయేరియా నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



జిల్లాలో అతిసారా నివారణ కార్యక్రమాలు ముమ్మరం చేస్తున్నట్లు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి తెలిపారు. శుక్రవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ జిల్లాలో అక్కడక్కడా అతిసారా కేసులు నమోదు అవుతున్నాయని వాటి నివారణకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అతిసారా నివారణ వారోత్సవాల పేరుమీద ప్రతి ఇంటింటికి తిరిగి పిల్లలను పరీక్షించడంతో పాటు డయోరియా ఉన్న వారిని గుర్తించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పిహెచ్‌సి పరిధిలో ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ పాకెట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

హజ్ యాత్రకు వెళ్లే వారికి వ్యాక్సినేషన్..

హజ్ యాత్రకు వెళ్లే 125 మంది ప్రయాణికులకు వ్యాక్సినేషన్ ఇవ్వడం జరిగిందని డా. ఓ ప్రభావతి తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా వీరికి వ్యాక్సినేషన్ ఇచ్చామన్నారు.

విఆర్ఎ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పండ్లపురం గ్రామానికి చెందిన వీఆర్ఏ తలారి చిన్న బాలుడు మృతి చెందారు. శుక్రవారం విషయం తెలుసుకున్న గ్రామ సేవకుల సంఘం జిల్లా అధ్యక్షులు నగేష్, మండల అధ్యక్షులు బాలుడుల ఆధ్వర్యంలో పండ్లపురం గ్రామానికి చేరుకొని గ్రామ సేవకులు చిన్న బాలుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులకు గ్రామ సేవకుల సంఘం ఆధ్వర్యంలో రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వీరి వెంట గ్రామ సేవకుల సంఘం నాయకులు గౌస్, ఉసేని నాయక్ ,చెన్నప్ప పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామ సేవకుల సంఘం నాయకులు

గణేష్ సదనాన్ని పరిశీలించిన ఉపముఖ్యమంత్రి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్మాణం చేపట్టిన గణేష్ సదనమును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం నాడు పరిశీలించారు. గణేష్ సదనములో ఏర్పాటు చేయబడుతున్న కౌంటర్లు, కార్యాలయపు ప్రదేశాలు, రెస్టారెంట్లు ప్రధాన బ్లాక్‌లో ఏర్పాటు చేయబడిన గదులను మంత్రి పరిశీలించారు. ముందుగా గణేష్ చదనం నిర్మాణం గురించి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి లవన్న ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గణేష్ సదనముకు చుట్టుపక్క ప్రాంతాల్లో ఆరుబోయిలు ప్రదేశాల్లో వీలైనంత మేరకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయంలో స్వామి అమ్మ వాళ్లకు జరుగుతున్న ఆర్జిత సేవలు గురించి ఆలయ వేళల గురించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. గదుల కోసం వచ్చిన భక్తులు వేచి ఉండేందుకు ప్రత్యేకంగా సౌకర్యాలు కల్పించాల న్నారు. భక్తుల సౌకర్యార్థం క్షేత్ర పరిధిలో గదుల సముదాయాలను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. దాతల సౌకర్యంతో గదుల సముదాల నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసి వాటిని ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రితో పాటు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకృష్ణ, నరసింహారెడ్డి, భాస్కర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ శాస్త్రి, శ్రీశైలం ప్రభ ఎడిటర్ డాక్టర్ అనిల్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులు ఉన్నారు.



ఇఒతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి

ప్రారంభమైన టెన్త్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

టెన్త్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమ య్యాయి. శుక్రవారం నుండి జరుగుతున్న పదవతరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల భాగంగా జిల్లా లో తెలుగు పరీక్ష ప్రశాంతంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు సజావుగా నిర్వహించారు. నంద్యాల జిల్లాలో 47 పరీక్షా కేంద్రాలలో 3,734 విద్యార్థులకుగాను 2,897 విద్యార్థులు హాజరయ్యారు. 77.588 శాతం పరీక్షకు హాజరైయినట్లు డిఇఒ అనురాధ తెలిపారు. 837 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం అనురాధ, 3 పరీక్ష కేంద్రాలను సందర్శించగా జిల్లా వ్యాప్తంగా 3 ఫ్లయి ంగ్ స్క్వాడ్ టీంలు 19 పరీక్షా కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ 1 పరీక్ష కేంద్రం తనిఖీ చేశారు. మొత్తం 23 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఉత్సవ మూర్తులకు పంచామత అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలు పూలమాల లతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు నిర్వహించిన ఎదుర్కోల కార్యక్రమం చూపరులను ఆకట్టుకుంది. వేద పండితుల వేదమ ంత్రాలు మధ్య కళ్యాణోత్సవం జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్ల పేరిట అర్చకులు ముత్యాల తలంబ్రాలు పాదాల చెంతన పోశారు. శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవానికి హాజరైన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

వాలంటీర్ల సేవలు అమోఘం

- వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లడంలో వాలంటీర్ల సేవలు అమోఘం అని వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలుకూరు గ్రామ సచివాలయంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండంశేషి రెడ్డి సేవా మిత్ర పురస్కారంకు ఎంపికైన వాలంటీర్లను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి ప్రజల ఇంటి దగ్గరికి వెళ్లి వాలంటీర్లు బాధ్యత సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. వారు ఎంతగానో కృషి చేస్తున్నారని వారి సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ అవార్డులను ప్రధానం చేయడం జరిగిందని వజ్ర, రత్న అవార్డుల కోసం మన వాలంటీర్లు సాధించుకునేటట్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసులు, సర్పంచ్ కోనేటి సుమలత, వైస్ సర్పంచ్ కే.శివకృష్ణ, వైసిపి నాయకులు ఎంపీటీసీ వెంకటేశ్వర్లు యాదవ్, జాను, సచివాలయ కన్వీనర్ వడ్డే వెంకటేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వాలంటీర్లను సన్మానిస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి

ఉపాధి పనులను ఎపిడి తనిఖీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలో ఉపాధి పథకం ద్వారా అమృత్ సరోవర్ ప్రాజెక్ట్‌లో భాగంగా రంగాపురం, ఆర్ బుక్కాపురం, రహిమాన్ పురం, ముసలాచెరువు గ్రామాల్లో కుంటల్లో చేసిన పనిని జిల్లా తనిఖీ బృందం సభ్యులు బనగానపల్లి డివిజన్ డిఇ ఉమాకాంత్ రెడ్డి, ఏపీడి శ్రీవిద్య శుక్రవారం నాడు తనిఖీ చేశారు. కుంటలో చేసినటువంటి పూడిక పనివలన నీటిని నిలువ చేసి భూగర్భ జలాలు పెంచడం కుంటకు అందుబాటులో ఉన్నటువంటి రైతు పొలాల్లో బోర్లు రీఛార్జ్ చేయడం పశువులకు పక్షులకు రైతులకు ఉపయోగపడే పనిగా గుర్తించారు. సమావేశంలో డిఆర్పి అశోక్, ఏపీవో శేషన్న, ఇసి సుబ్బా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న దృశ్యం



మూడు నెలల్లో వాటర్ ట్యాంక్ పూర్తి చేయాలి

మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

మూడు నెలల్లో ఈఎల్ఎస్ఆర్ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను పూర్తి చేయాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదేశించారు. డోన్ పట్టణంలోని వైఎస్ నగర్‌లో రూ. 11.80 కోట్లతో నిర్మిస్తున్న ఈఎల్ఎస్ ఆర్ ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించా రు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ మూడు నెలల్లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను పూర్తి చేయాలని ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశిం చారు. వైఎస్ నగర్, శ్రీరామ్ నగర్, టి.ఆర్ నగర్‌లకు 5.5 కిలోమీటర్ల మేర పైపులైన్ పనులు పూర్తయ్యాయని తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్




ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఫారెస్ట్ అధికారులు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రతి ఒక్కరూ ఇంటింటికి కనీసం ఒక మొక్కను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్ కుమార్ ఆదేశాల మేరకు రుద్రవరం అటవీ క్షేత్రాధికారి శ్రీపతి నాయుడు ఉత్తర్వుల మేరకు పర్యావరణ హిత జీవనశైలి మాసోత్సవంలో భాగంగా నూతల సెక్షన్ ఫారెస్ట్ బీట్ అధికారి రామకృష్ణ, చెలిమ కూప్ ఫారెస్టర్ రాణమ్మ ,ప్రొటెక్షన్ వాచర్ దానమయ్యలు కలిసి ఆళ్లగడ్డ మండలం గూబగుండం మెట్ట, పేరాయపల్లి గ్రామ ప్రజల సమక్షంలో "పర్యావరణ హిత జీవనశైలి"లో భాగంగా వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ శక్తి వనరులను, నీటిని పొదుపుగా వాడాలన్నారు. ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వద్దు అని వివరించారు. ఎలక్ట్రానిక్ వ్యక్తములను తగ్గించి సుస్థిరమైన ఆహార పద్ధతులను, ఆరోగ్యకరమైన జీవన శైలులను అలవర్చుకోవాలన్నారు.


ఎంపీడీవో కు వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు

పవన్ కళ్యాణ్‌ను కించపరిచే ఫ్లెక్సీలను తొలగించాలి : జనసేన

ప్రజాశక్తి - బనగానపల్లె

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను కించపరిచే విధంగా వైసిపి నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించాలని జనసేన పార్టీ నాయకులు భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శివరామయ్యకు బనగానపల్లె పట్టణం లో ఆర్ అండ్ బి ఆఫీస్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అవుకు మెట్ట దగ్గర ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించాలని జనసేన పార్టీ నాయకులు భాస్కర్ ఆధ్వర్యంలో అజిత్ రెడ్డి, షేక్షావలి, శేఖర్, రాజు, శంకర్ జనసైనికులు పోలీస్ పోలీస్ స్టేషన్‌లో, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు భాస్కర్ మాట్లాడుతూ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా, శాంతి భద్రతలకు భంగం కలిగేలా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను పంచాయతీ అధికారులతో వెంటనే తొలగించాలన్నారు. లేని పక్షంలో పార్టీ తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించే విధంగా ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు హాజీ, రాఘవేంద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పవన్ కుమార్

గిరిజన గూడెంలో సీజనల్ వ్యాధులపట్ల అవగాహన

ప్రజాశక్తి - ఆత్మకూరు

మండలంలోని బైర్లుటీ గూడెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు మలేరియా నివారణ మసోత్సవాలో భాగంగా వైద్యాధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ దోమల నివారణకు దోమతెరలు వాడాలని, ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పనికి రాని కూడలలో టైర్లలో నీరు నిల్వవుండకుండా చూసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ కాచి వడగట్టిన నీటిని తాగాలని, తాజాగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు.అత్యవసర పరిస్థితులలో ప్రైవేట్ ఆసుపత్రిని ఆశ్రయించ వద్దని,దగ్గరలో ఉండే బైర్లుటీ ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉన్నామని తెలిపారు. టిబి సూపర్వైజర్ రవికుమార్ మాట్లాడుతూ టిబి ముక్త్ పంచాయతీ గూర్చి అవగాహన కల్పించి, ఇంటింటి సర్వే నిర్వహిస్తామని క్షయ వ్యాధిగ్రస్తులు గుర్తిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి చాణక్య, వి.ఆర్.ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గూడెంలో ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఆరోగ్య శ్రీ కార్డ్, ఆధార్ లో సవరణలు చేయించుకోవాలని తెలిపారు. సర్పంచ్ గురువమ్మా ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బేబీ జ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ మహోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో పల్లకి సేవ మహోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పల్లకిని ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయండి

- నోడల్ అధికారి లలిత కుమారి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు డివిజన్లో నాడు- నేడు పనులను యుద్ధ ప్రాతిపదికన త్వరితగతిన పూర్తి చేయాలని లలిత కుమారి, డిప్యూటీ డిఇఓ మహబూబ్ బేగ్ అన్నారు. శుక్రవారం నాడు ఆత్మకూరు పట్టణంలోని థెరిసా జూనియర్ కళాశాల యందు డివిజన్లోని 9 మండలాలకు చెందిన ప్రధానో పాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, నాడు నేడు పనులు జరుగుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 12 నాటికి పాఠశాలలో నేపథ్యంలో 9 మండలాల్లో అమలవుతున్న నాడు నేడు పనులను పూర్తి చేయాలని అన్నారు. ప్రధానంగా మరుగుదొడ్లు, విద్యుత్ కనెక్షన్లు, వంటగదులతో పాటు పాఠశాలలో అహల్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేయాలన్నారు. నాడు నేడు పనులు కు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ఇప్పుడే విడుదల చేసిందని ఈ పనులు పూర్తయ్యేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకొని అవకాశం కూడా ఉన్నదని వారన్నారు. ఈ కార్యక్రమానికి 9 మండలాలకు చెందిన ఏపీఎంలు, సిఆర్‌టిలు, పీఆర్టీలు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి

వాగు ఆక్రమణ కాకుండా కాపాడండి

- దళితుల ఆందోళన

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని శెట్టివీడు గ్రామం ఎస్‌సి కాలనీ సమీపంలో ఉన్న వాగులో కొందరు స్థిరాస్తి వ్యాపారవేత్తలు అక్రమంగా గోడను నిర్మిస్తున్నా రని ఎస్‌సి కాలనీ వాసులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. గ్రామ సమీపంలో ఉన్న వంక పైబాగాన ఉన్న వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి సొమ్ము చేసుకునే వ్యాపారస్థులు కొన్ని ఏళ్ల తరబడి ప్రవహిస్తున్న వంకలో రాళ్ళ కటకం కట్టడం వల్ల వర్షాకాలం వస్తే తమ కాలనీ ముం పుకు గురవుతోందని ఆవేదన వ్యకం చేసారు. అనంతరం తహశీల్దారు కార్యాల యంలో తహశీల్దార్ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేసి కాలనీ ముంపుకు గురి కాకుండా అక్రమంగా కడుతున్న కట్టడాలు నిలిపివేసి కాలనీ ముంపుకు గురి కాకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బాలు,ప్రతాప్, రాజేంద్ర, బాలనర్సయ్య, అంజీ, ఓబులేసు, శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.


ఆక్రమించుకున్న వాగు చూపుతున్న దళితులు


తహసీల్దారు కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

శానిటేషన్ సెక్రెటరీల సమయపాలన మార్చాలి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల మున్సిపాలిటీలో శానిటేషన్, ఎన్విరాన్మెంట్. సెక్రెటరీలకు సచివాలయ సమయపాలన ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 వరకు అమలు చేయాలని సిపిఐ నంద్యాల పట్టణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో డిగ్రీ, పి.జి. చదివిన వీరికి సానిటరీ మేస్త్రి విధులు అప్పగించడం వీరి ఆత్మ గౌరవాన్ని చంపడమే అని అన్నారు. వీరికి మిగతా సెక్రటరీల వలే సచివాలయం సమయపాలన అమలు చేయాలని కోరారు. వార్డు శానిటేషన్–ఎన్విరాన్మెంట్ కార్యదర్శుల సమస్య లపై ముఖ్యమంత్రికి,ప్రభుత్వ ప్రధాన సలహాదారులు సజ్జల రామకృష్ణ రెడ్డికి, మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సీడీఎంఏ డైరెక్టర్ కోటేశ్వరరావుకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు ప్రభుత్వంకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోలేదని.. ప్రభుత్వ ఉత్తర్వులు అమలు పరచాలని కోరుతున్నారని తెలిపారు. కమిషనర్‌లు వీరిపై ఎటువంటి చర్యలు తీసుకున్న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉద్యోగ సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.



వినతిపత్రం అందచేస్తున్న సిపిఐ నాయకులు

టి లింగం దిన్నెలో విగ్రహ ప్రతిష్ట వేడుకలు

- హోరా హోరీగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని టి లింగం దిన్నె గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ట, మహా కుంభ స్థాపన చక్ర బ్జ మండలారాధన, పలు కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన ప్రజలకు నిర్వాహకులు భోజన వసతులు కల్పించారు.

ఎద్దులకు బండలాగుడు పోటీలు

విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా బండలాగుడు పోటీలు నిర్వహించగా హోరాహోరిగా సాగాయి. ఈ పోటీలలో నంద్యాల, కడప, కర్నూలు , పలుజిల్లాలకు చెందిన 14జతల వృషభ రాజములు పోటీలలో పాల్గొన్నాయి. ఈపోటీల్లో గెలుపొందిన వృషభ రాజముల యజమానులకు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. పోటీలను తిలకిం చడానికి చుట్టుపక్క గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


బండలాగుతున్న ఎద్దులు

అశ్విని హాస్పిటల్ గుర్తింపును రద్దు చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలోని అశ్విని హాస్పిటల్ లైసెన్సును రద్దు చేసి, డాక్టర్ అనంత యాదవ్‌ను అరెస్ట్ చేయాలని సిపిఐ తాలూకా కార్యదర్శి కే శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం కొత్తపల్లి గ్రామానికి సంబంధించిన ఓ మహిళ ప్రసవ వేదనతో అశ్విని హాస్పిటల్‌లో చేరగా గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీప్రసన్న బదులు ఆమె భర్త డాక్టర్ అనంత కుమార్ యాదవ్ ఆ మహిళకు సిజరింగ్ చేసి బిడ్డకు చేతులు విరగొట్టడం జరిగిందని, తన నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకు నేందుకు డాక్టర్ లక్ష్మీప్రసన్న తానే సిజేరియన్ ఆపరేషన్ చేసినట్టు ఒప్పుకోవడం విడ్డూరమన్నారు. ఎలాంటి అనుభవం లేకుండా సిజరిన్ ఆపరేషన్ చేసిన డాక్టర్ అనంత కుమార్ యాదవ్‌ను అరెస్టు చేయాలని అన్నారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. జిల్లా వైద్య అధికారి ఇక్కడ పరిస్థితిపై విచారణ జరిపించి బాధితులకు బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఐ పాములపాడు, కొత్తపల్లి, మండల కార్యదర్శులు టి ప్రతాప్, కే వెంకట శివుడు, మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంతకుమారి, స్వాతి, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి అహ్మద్ హుస్సేన్, వ్యవసాయ కార్మిక సంఘం పాములపాడు అధ్యక్షులు చిలుక ఏసేపు, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలి

5వ పేజీ తరువాయి..

బేతంచెర్ల: నగర పంచాయతీ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులు కే నాగభూషణం, ముత్యాలరావు, సిఐటియు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 31వ తేదీన మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కై సిఐటియు ఆధ్వర్యంలో హిందూపురం నుండి మొదలైన జీపు జాత బేతంచెర్ల చేరుకున్న సందర్భంగా పట్టణ పురవీధుల గుండా సిఐటియు జిల్లా నాయకులు వైబి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి స్థానిక పాత బస్టాండ్ నందు ఎల్లయ్య అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులలో నూటికి 90 శాతం దళితులు మిగిలిన 10 శాతం బడుగు బలహీన వర్గాల వాళ్ళు ఎక్కువ శాతం మహిళలు విధులు నిర్వహిస్తున్నారని, మున్సిపల్ కార్మికులకు పని భద్రత కల్పించడంలో పాలక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు విమర్శించారు. ఎన్నికల కంటే ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఇచ్చిన హామీలను ఇంతవరకు ఏ ఒక్కటి నెరవేర్చకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు దాదాపు 40 వేల మందికి పైగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పదివేలకు పైగా సిపిఎస్ ఉద్యోగులు, వెయ్యి మందికి పైగా ఆఫీస్ ఇబ్బందిగా పనిచేస్తున్నారని వీరందరికీ పాలక ప్రభుత్వం ఇవ్వకపోగా కార్మికులపై పనిచేసే ప్రదేశాలలో అధికారులు నానా దుర్భాషలనడం దారుణం అన్నారు. విశ్రాంతి సమయంలోనూ ఒత్తిడి తీసుకొచ్చే విధంగా అనేక రకాలుగా కార్మికులను ఇబ్బంది పెట్టడం జరుగుతోందన్నారు. దాదాపు 30 నుంచి 30 సంవత్సరాలుగా పనిచేసే గ్రాట్యూటి లేక సర్వీస్ లేక పెన్షన్ లేక ఖాళీ చేతులతో మున్సిపల్ కార్మికులు ఇండ్లకు వెళ్తున్నారని అన్నారు. మున్సిపల్ కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇస్తూ పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించకపోగా హెల్త్ అలవెన్స్ కింద నేలకు 6000 రూపాయలు ఇవ్వడం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 12000 రూపాయల జీతాలు నుండి 15000 వరకు పెంచి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయడంలో మాట తప్పి మడమ తిప్పారని వారి విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం 010 పద్దు ద్వారా సక్రమంగా జీతాలు ఇచ్చి మునిసిపల్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి మున్సిపల్ కార్మికులకు 26000 జీతాన్ని అమలు చేయాలని వారు కోరారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఇచ్చిన పర్మనెంట్ హామీ, పెన్షన్ సౌకర్యము, బీమా సౌకర్యం, మున్సిపల్ కార్మికులు చనిపోయిన కుటుంబానికి 25 వేల రూపాయలను మట్టి ఖర్చులకు ఇవ్వాలని వారి కోరారు. ఇప్పటికైనా ముఖ్యమ ంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ లను అమలు చేసి కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేదంటే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాల్సిన పరిస్థితి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు స్థానిక నాయకులు ఎస్ కాజా, శ్రీనివాసులు, కోవెలకుంట్ల భాష ఎస్ కే భాష, శివ, మహబూబ్బాషా, రామసుబ్బయ్య, చిన్న ఓబులేసు, కడియాల లచ్చమ్మ, పద్మావతి ,లక్ష్మీదేవి, రత్నమ్మ, శివలక్ష్మి ,మరియమ్మ, మార్తమ్మ, రంగడు, సుబ్బరాయుడు, రామాంజనేయులు ,మద్దమ్మ, వెంకట లచ్చమ్మ, సుధాకర్, చంటి,మహేశ్వరి ,నాగమణి, ఎల్లయ్య ,నాగరాజు పాల్గొన్నారు.



మున్సిపల్ జాతా బేతంచెర్లకు వచ్చిన సందర్భంగా పాత బస్టాండ్ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం


మున్సిపల్ జాతా బేతంచెర్లకు వచ్చిన స్వాగతం పలుకుతున్న మున్సిపల్ కార్మికులు, సిబ్బంది


దర్శనం అనంతరం బయటకు వస్తున్న కేంద్రమంత్రి

మల్లన్న సన్నిధిలో కేంద్ర మంత్రి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను భారత ప్రభుత్వ ఈశాన్య ప్రాంత సహకారం, అభివృద్ధి రాష్ట్ర మంత్రి బి.ఎల్.వర్మ శుక్రవారం నాడు దర్శించుకున్నారు. దర్శనార్థమై ఆలయ రాజగోపురం వద్దకు వీరు చేరుకోగా ఆలయ అధికారులు ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకోవడం జరిగింది అని ఆలయ అధికారులు తెలిపారు.


విరాళం అందజేసిన హైకోర్టు న్యాయవాది

ఆలయ నిర్మాణానికి హైకోర్టు న్యాయవాది విరాళం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని కోట కందుకూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీరభద్రుడు స్వామి దేవాలయం నిర్మాణం కోసం హైకోర్టు న్యాయవాది డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. గ్రామ పెద్దలు ఆర్ల లక్ష్మయ్య, ఆర్ల బుజ్జి కొట్టే నరసింహ రాయని నడిపి సుబ్బయ్య, దుర్వేసుల గోపాలు, దుర్వేసుల రమేష్, గంగారిపాటి సుబ్బయ్య, దేశ బాల మద్దిలేటి, అర్జున్ గారి బోడెన్న, కొండపేట వీరయ్య, చిన్న నారాయణ, అంబారపు మల్లికార్జున, శ్రీనివాసులు, దుర్వేసుల కుమార్ విజ్ఞప్తి మేరకు ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ గోగి శెట్టి నరసింహారావు100116 లక్షల రూపాయలు శుక్రవారం నాడు గ్రామ పెద్దలకు, ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ నిర్మాణానికి తన వంతు సహాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గ్రామ పెద్దలు ఆలయ నిర్వాహకులు అడిగిన వెంటనే ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం చేసిన డాక్టర్ గోగిశెట్టి నరసింహారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలా గురు మూర్తి, సింగం భరత్ రెడ్డి, ఆర్ల నాగ శ్రీనివాసులు, చింతకొమ్మ దీన్నే సుబ్బారెడ్డి, ఉద్దంటి నరసింహులు రుద్రవరం శీను, రుద్రవరం అన్నదాత తదితరులు పాల్గొన్నారు.


జూపల్లి రామేశ్వరావును సన్మానిస్తున్న యాగంటి దేవస్థానం చైర్మన్ తోటబుచ్చిరెడ్డి

ప్రముఖ పారిశ్రామికవేత్త జూపల్లి రామేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

మై హోమ్ ఇండస్ట్రీస్ అధినేత జూపల్లి రామేశ్వరావును యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి మర్యాదపూ ర్వకంగా కలిశారు. యనకండ్ల గ్రామంలోని శ్రీనగర్ కాలనీలో సీతారాముల బ్రహ్మోత్సవాలు మే 30వ తేదీ నుంచి జూన్ మూడవ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన డానికి వచ్చినా మై హోమ్ ఇండస్ట్రీస్ అధినేత జూపల్లి రామేశ్వరరావు యాగంటి శివమావాస్యల స్వామి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి ఆలయ సిబ్బంది పూజారులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానిం చారు. బ్రహ్మోత్సవాలలో యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి పాల్గొనడంతో పాటు మై హోమ్ ఇండస్ట్రీస్ అధినేత జూపల్లి రామేశ్వ రావును మర్యాదపూర్వకంగా కలిసి వారిని సత్కరించి వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో నందవరం ఆర్కియాలజీ అధికారి శ్రీనివాసులు, తోట మల్లికార్జున్ రెడ్డి, యమ్మనూరు మాధవరెడ్డి యాగంటి ఆలయ అర్చకులు పాల్గొన్నారు.